



తూర్పుగోదావరి జిల్లా



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

కోనసీమ జిల్లా



అమలాపురంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు

కాకినాడ జిల్లా



పిఠాపురంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ

అక్షర.. వారధి!

అక్షరం ఏం చేయగలదు!? ప్రతి రోజూ పాఠకులకు తాజా తాజా వార్తలు చేరవేస్తుంది..అంతే..! ఇది నిన్నటి వరకూ ఉన్న ఒక వాదన.. అదేం కాదు..? 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' అక్షరం ఏం చేయగలదో నిరూపించింది.. జనగళమై ప్రజలకు ప్రజా ప్రతినిధులు . అధికారులను చేరువచేసింది.. వారధిగా మారి ప్రజా సమస్యల గళం వినిపించింది.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మూడో వార్డు, కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డులో మంగళవారం ఉదయం అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా సభలను నిర్వహించారు. ఈ సభలకు పెద్ద ఎత్తున జన స్పందన లభించింది.. ఆయా ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం హాజరై సమస్యలపై గళమెత్తారు. రాజమహేంద్ర వరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అమలాపురంలో కమిషనర్ రాజు, పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జి వర్మ, కమిషనర్ కనకారావు వాటిని విని పరిష్కరిస్తామని అక్కడికక్కడే హామీలు ఇచ్చారు.



అక్షరం కదిలించింది.. అండగా నిలిచింది!

ఐదేళ్ల సమస్య: రోడ్డు నిర్మించరు.. డ్రైనేజీ లేదంటూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎస్ఈ పాండురంగారావుకు సమస్యలు విన్నవిస్తున్న మాధవవర్మ





వేదికపై ఎమ్మెల్యే వాసు చిత్రంలో రంగబాబు, ఎస్ఈ పాండురంగారావు, వినూత్న, చండీప్రియ, బీఎం శ్రీనివాసరావు

ప్రజాగళమై.. ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి మరో అడుగు

- అక్షరం అండగా సభకు విశేష స్పందన
- రాజమండ్రి 9వ డివిజన్‌లో నిర్వహణ
- 200 మందికి పైగా హాజరు
- పలు సమస్యలపై విన్నపాల వెల్లువ
- అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే వాసు
- 25 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ

రాజమహేంద్రవరం/సిటీ/అర్బన్/రూరల్/కడియం/రాజానగరం/గోకవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : అక్షరం అండగా నిలిచింది..జనగళమై కదిలింది.. ప్రజా వాణి వినిపించింది..సాధారణ జనం ఎమ్మెల్యే స్థాయి నాయకులను కలిసి సమస్యను చెప్పుకోవాలన్నా కష్టమే. దానికి ఎన్నో సిఫారసులు ఉంటేనే కానీ కలవడం.. సమస్యను చెప్పుకోవడం కష్టమే. అందుకే ఆంధ్రజ్యోతి మరో కొత్త అడుగు ముందుకేసింది..ప్రజలు..ప్రజా ప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తున్నది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధి 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్ ఐఎంఏ హాలులో మంగళవారం నిర్వహించిన అక్షరమే అండగా పరిష్కారమే అజెండాగా సభకు విశేషస్పందన కనిపించింది. కాలనీ నుంచి సుమారు 200 మంది ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించారు. తొలుత ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సభ ముఖ్యోద్దేశమని తెలిపారు. సమస్య పరిష్కరించే వరకూ ఆంధ్రజ్యోతి నాయకుల వెంటపడు తూనే ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏబీఎన్- ఆంధ్రజ్యోతి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల వెంకటేశ్వనగర్‌లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. కల్వర్టుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయిస్తామన్నారు. డ్రైనేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. నగరపాలక సంస్థ ఎస్ఈ జి.పాండురంగా రావు మాట్లాడుతూ 9వడివిజన్‌లో డ్రైనేజీ, రహదారుల సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. పార్కులకు సంబంధించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.ఈ మేరకు బుధవారం పార్కులను పరిశీలిస్తామన్నారు. బీజేపీ నాయకుడు యెనుముల రంగబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ మాట్లాడుతూ ప్రజలకు.. ప్రతిప్రతినిధులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి నిలవడం అద్భుత ఆలోచన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈలు పి.రీటా,వాటర్ సప్లయిస్ ఈఈ మాధవి,డీఈలు లోవరాజు,సత్యనారాయణ, ఆర్‌వో సీహెచ్ శ్రీనివాసరావు,శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎ. మాధవవర్మ,పార్కు అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ ప్రభాకర్,ఏబీఎన్-ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు ఎస్ఎస్ఎన్.సత్యనారాయణ,కె.రాజబాబు,జర్నలిస్టులు ఎంబీవీ.సారధి,కె.శ్రీకాంత్,వీర్రాజు, బెజవాడ శంకర్, దాసరి రామచంద్రరావు,పి.దుర్గారావు,ఏవి.దొర పాల్గొన్నారు.

కాలనీకి అంగన్‌వాడీ సెంటర్ కావాలి

డివిజన్‌కు అదనంగా అంగన్వాడీ సెంటర్ కావాలి. సచివాలయాలు దూరంగా ఉన్నా యి..కాలనీకి చేరువ చేయాలి. శానిటేషన్ సిబ్బంది మస్తరు వేసుకోవడానికి కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉంది.కనీస సౌకర్యాలైన రోడ్లు డ్రైనేజీ, తాగునీరు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలి. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి ఆలోచన బాగుంది.

- కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్

ప్రధాన సమస్యల ఏకరవు..

వెంకటేశ్వరనగర్ కాలనీ వాసులు పలు ప్రధాన సమస్యలు విన్నవించారు.. డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నా యి.దోమలు బెడద పెరిగింది.. రాత్రివేళలో పార్కులపై నిఘా పెట్టాలి..వీధి దీపాల సమస్యలు ఉన్నాయని మాధురి అన్నారు. కుక్కలు అధికంగా ఉన్నాయి. అవి పార్కుల్లోకి వెళ్లి పిల్లలపై దాడి చేస్తున్నాయని జవహర్ క్లబ్ సభ్యుడు డి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. బర్మాకాలనీలో కుక్కలు, పందులు అధికంగా ఉన్నాయని ఎస్వీ.సరస్వతి తెలిపారు.లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని ఈశ్వరరావు వేడుకున్నారు.రోడ్డు-4లోకి వెళ్లాంటే చాలా ఇబ్బందికరంగా ఉందని శ్రీమణి వాపోయారు. కమ్యూనిటీ భవనాలు సచివాలయాలుగా వినియోగిస్తున్నారని గొలుగూరి వెంకటరెడ్డి తెలిపారు. పార్కులో సౌకర్యాలు కల్పించాలని కాశి విశ్వనాథరాజు, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి ఏ.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్యే విన్నారు.. పరిష్కారం చూపారు..



రంగబాబు



పాండురంగారావు



వినూత్న



చండీప్రియ

గత వైసీపీ ప్రభుత్వం రహదారులు, డ్రైనేజీలను నిర్లక్ష్యం చేసింది. మా కూటమి ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలు చేస్తుంది..సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం.25 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బర్మాకాలనీలో రూ.60 లక్షలతో తాగునీటి సదుపాయాలు కల్పించాం. రూ.2.90 కోట్లతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ వచ్చే నెలాఖరు పూర్తవుతుంది.పందుల బెడదకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని కమిషనర్‌తో చర్చిస్తున్నాం.పారిశుధ్య మెరుగుదలకు 25 వాహనాలు కొనుగోలు చేశా ం.59 మంది శానిటేషన్ సిబ్బందిని నియమించాలనిప్రతిపాదనలు పంపించాం. బర్మాకాలనీకి చెందిన వారి రిజర్వేషన్లు విషయమై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి చొరవచూపుతా. విద్యుత్ సమస్య పరిష్కారానికి 50 ట్రాన్స్‌ఫార్మర్లు,రెండు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నాం.

బర్మా నుంచి వచ్చాం.. కుల సర్టిఫికెట్ కావాలి..

శ్రీలంకలోని బర్మా నుంచి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నా. అనేక ఏళ్ల నుంచి ఉంటున్నా పర్మినెంట్ కుల సర్టిఫికెట్ ఇవ్వడంలేదు. కుల సర్టిఫికెట్ ఇప్పించాలి.జమున ఎంపీగా పనిచేసిన సమయంలో మాకు ఇచ్చిన ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ కాలేదు. **- పొన్నుస్వామి రంజిత్, బర్మాకాలనీ**

గోదావరి నీళ్లు 10 నిమిషాలే వస్తున్నాయి..



గోదావరి నీరు పది నిమిషాల కంటే ఎక్కువ సేపు రావడంలేదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది.నీరు సక్రమంగా సరఫరా చేయాలి.పార్కు నిర్వహణ అంతంతమాత్రమే.

- రాజు పరమేశ్వరి, బర్మాకాలనీ, 5వ వీధి

మీటింగ్ పెట్టుకోవడానికి పార్కులో చోటివ్వడంలేదు..



మహిళలు మీటింగ్ పెట్టుకోవడానికి పార్కులో చోటు ఇవ్వడంలేదు. వేరొకరికి ఇస్తున్నారు. మేము మీటింగ్ పెట్టుకోవ డానికి పార్క్‌లో స్థలం ఎందుకు కేటాయించడంలేదు.

- కట్టా తనూజ, బర్మాకాలనీ, 4వ వీధి

రోడ్డు తవ్వేసి వదిలేశారు..



మా ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా రోడ్డు తవ్వేసి వదిలేశారు. ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియడంలేదు.

- నక్కా అప్పారావు, హెరిటేజ్ అపార్టుమెంట్స్

రోడ్డు కంటే డ్రెయినేజీ ఎత్తుగా ఉంది..



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పూడికతో నిండిపోతోంది. డ్రైనేజీ ఎత్తు పెరిగింది. రోడ్డు పల్లంగా ఉంది. ఒక పక్క డ్రైనేజీ పూర్తిచేసి మరో పక్క అసంపూర్తిగా వదిలేశారు. **- ఏవీ.సత్యనారాయణ, కుక్కల ఆసుపత్రి వీధి**

రెంటల్ వేల్యూపై పన్ను వేయాలి



గత ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులు దారుణంగా పెంచేశారు. కూటమిలో అదే కొనసాగుతోంది. ప్రాపర్టీ వేల్యూ మీద కాకుండా రెంటల్ వేల్యూమీద పన్ను వేయాలి. **- కేఎస్‌వీ రఘురాం, ఐఎంఏ వీధి**



వేంకటేశ్వరనగర్ ఐఎంఏ హాలులో నిర్వహించిన సభకు హాజరైన 9వ డివిజన్ కాలనీ వాసులు, అధికారులు



జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 298 మంది మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై మంగళవారం రాజమహేంద్రవరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయం నుంచి సెంట్రల్ జైలు మీదుగా కంబాలచెరువు, ఆర్యాపురం, పేపర్‌మిల్లు, గోదావరి బండ్, డీలక్స్ సెంటర్, బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, తిలక్‌రోడ్డు, లాలాచెరువు సెంటర్ మీదుగా తిరిగి రవాణాశాఖ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ సాగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత జెండా ఊపి బైకు ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురైనపుడు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు. 2023లో 849 రోడ్డు ప్రమాదాలు జరిగితే 329 మంది చనిపోయారని, 2024లో 728 ప్రమాదాలు జరిగితే 298 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సేకరించిన 550 హెల్మెట్లను వాహనదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. బైక్ కొనుగోలు సమయంలో హెల్మెట్ తీసుకుంటున్నా ఆ తర్వాత వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడం విచారకరమన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి జిల్లా రవాణాశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, ఎంవీఐలు, ఏఎంవీఐలు, అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న సీఎం చంద్రబాబు పర్యటన

కొవ్వూరు, అనపర్తి నియోజకవర్గాల్లో ఏర్పాట్లు

కొవ్వూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి ఒకటో తేదీన జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు టౌన్,మండలంలోని దొమ్మేరు గ్రామాల్లో మంగళవారం స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఆరికిరేవుల రోడ్‌లోని స్పెక్ కాలనీ లేఅవుట్, కొవ్వూరుటౌన్ పరిధిలోని సీఎస్‌జీ గ్యాస్ బంకు వెనుక ప్రైవేటు లేవుట్, గామన్ బ్రిడ్జి వద్ద లే అవుట్, దొమ్మేరు పెట్రోల్ బంకు వద్ద ప్రైవేటు లే అవుట్, దొమ్మేరు గ్రామంలో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించారు.అనంతరం కొవ్వూరు, దొమ్మేరు గ్రామాల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రాజబాబు పర్యటించారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లకు సంబంధించి పూర్తి వివరాలు ఖరారు చేసి వెల్లడించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి సంబంధించి ఫిబ్రవరి ఒకటో తేదీన కొవ్వూరు నియోజకవర్గంలో సీఎం పర్యటన ఖరారైందన్నారు. పర్యటనను అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, జేసీ ఎస్.చిన్నరాముడు,ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, కలగర సుబ్బారావు, గారపాటి రామకృష్ణ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ కె.భాస్కర రావు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత,డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐలు కె.జగన్మోహనరావు, కె. శ్రీహరిరావు ఉన్నారు.



దొమ్మేరులో కాలినడకన పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆర్డీవో రాణిసుస్మిత, సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని తదితరులు

సీఎం కొవ్వూరు పర్యటన ఇలా..

కొవ్వూరు మండలం దొమ్మేరు ఐబీపీ పెట్రోల్ బంకు కాలనీని ఆనుకుని ఉన్న ప్రైవేటు లేఅవుట్‌లో హెలిప్యాడ్ వద్ద ఉదయం 10 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్‌లో దిగు తారు.అక్కడ నుంచి కారులో దొమ్మేరు చేరుకుని 1 గంట వరకు పర్యటిస్తారు. నీలాలమ్మ గుడి సమీపాన ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. సచివాలయం సమీపంలోని సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రక్కన చెట్టు వద్ద రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొంటారు. గత ఐదేళ్లుగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖాముఖి తెలుసుకుంటారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరును వివరిస్తారు.

అనపర్తిలో పరిశీలన..

అనపర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల మొదటి వారంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అనపర్తి శివారు కొత్తూరు కాలనీలో పర్యటిస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు కాలనీని మంగళవారం కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కెనాల్ రోడ్డు నుంచి కాలనీ వరకు ఉన్న దూరం అదే విధంగా కొత్తూరు వద్ద ఉన్న రైల్వే గేటును పరిగణనలోకి తీసుకున్నారు. గ్రామానికి కాలనీకి ఉన్న దూరాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి.కృష్ణనాయక్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ దివ్య, ఎస్‌బి డీఎస్పీ రామకృష్ణ,ఎంపీడీవో రామకృష్ణారెడ్డి,తహశీల్దార్ అనిల్‌కుమార్,ఎస్‌టీ సీఐ శ్రీనివాస్, అనపర్తి సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ పాల్గొన్నారు.



హైవేపై అధికారులతో చర్చిస్తున్న గోరంట్ల

పుష్కరాలకు రోడ్ల విస్తరణ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పుష్కరాల నాటికి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నివారణకు ప్రణాళికలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. జాతీయ రహదారుల విభాగం పీడీ సురేంద్రనాథ్ బృందంతో కలిసి మంగళవారం మోరంపూడి నుంచి కడియపులంక వరకు జాతీయ రహదారిపై పలు ప్రాంతాలను పరిశీలించారు. త్వరలో మోరంపూడి నామవరం రోడ్ నాలుగు లైన్లుగా విస్తరిస్తామన్నారు. మోరంపూడి జంక్షన్ నుంచి ఫ్లైఓవర్ చివరి వరకు ఆక్రమ ణలు తొలగించి సర్వీస్ రోడ్డు వెడల్పు చేయాలన్నారు. హుకుంపేట జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డుతో పాటు డ్రైన్ పనులు చేపట్టాలని, ఈస్ట్ రైల్వే రోడ్డు 4 లైన్లుగా విస్తరించి డీమార్ట్ వద్ద ఉన్న 100 అడు గుల సర్వీస్‌కు కలపాలన్నారు.హుకుంపేట జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ అన్సారి, బ్రిడ్జి ఇంజనీర్ మహేష్, ఏఎస్ ఎంఈ రాహుల్, శ్రీనివాస్, బాలసుబ్రహణ్యం, డీజీఎం రమణ పాల్గొన్నారు.

నిరంతరం తల్లిదండ్రులను గౌరవించాలి

- ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది
- ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ తేజ

దివాన్‌చెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లిదండ్రులను పిల్లలు నిరంతరం గౌరవించాలని ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ విద్యార్థులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. శ్రీప్రకాష్ డైరెక్టర్ సీహెచ్.విజయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ తేజ మాట్లాడుతూ తల్లి నవ మాసాలు మోసి జన్మనిస్తే తండ్రి తన గుండెలపై మోస్తూ పిల్లను ప్రయోజకులను చేస్తారన్నారు. అందుకే పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ముఖ్యంగా కుటుంబంలో తాతలు వంటి పెద్దవారు చెప్పే మాటలు వినాలని అన్నారు. మొబైల్స్ వాడకం తగ్గించాలని, లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈ అభినందనలో మీకు కొడుతున్న చప్పట్లు మీ విజయాలకు మెట్లు కావాలన్నారు. తాను గత 30 సంవత్సరాలుగా 2వేల సినిమాల్లో మూడువేల పాటలు రాశానని తెలిపారు. తాను సినిమాల్లోకి రాక ముందు దాదాపు 2వేల పాటలు సామాజిక, ప్రజల పాటలు రాశానన్నారు. ప్రస్తుతం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చిందన్నారు.

విజయప్రకాష్ మాట్లాడుతూ అశోక్‌తేజ చెప్పిన ప్రతీ మాట అక్షర సత్యమని, ప్రతీఒక్కరూ దానిని పాటించాలని సూచించారు. విద్య, క్విజ్, ఆటపోటీలు, పోటీ పరీక్షలు, హాజరు తదితర అంశాల్లో ప్రతిభ కనబరచిన వారికి అశోక్ తేజ బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అశోక్ తేజకు వేటూరి సాహితీ పురస్కారం ప్రదానం

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేటూరి పురస్కార ప్రదాన వేడుకను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రో ప్రాంగణంలో బుధవారం వేటూరి సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు అందజేయనున్నారు. సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



ఆహా కాశం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం వద్ద ఆకాశం మంగళవారం సాయంత్రం అరుణవర్ణం దాల్చింది. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు -గొల్లప్రోలు రూరల్

ఆకట్టుకున్న పురూలియా చౌ

జేఎన్టీయూకేలో సంప్రదాయ జానపద నృత్యప్రదర్శన నిర్వహణ

జేఎన్టీయూకే, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో జేఎన్టీయూకేలోని అలూమ్ని ఆడిటోరియంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పదో రోజు పశ్చిమబెంగాల్ కళాకారులు నిర్వహించిన పురూలియా చౌ సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పురూలియా చౌ అనేది భారతదేశంలోని పశ్చిమబెంగాల్‌కు చెందిన సెమీ క్లాసికల్ జానపద నృత్యం. పరమశివుడిని పూజించడానికి అనాదిగా వస్తున్న పూజావిధానాలు, శాస్త్రాలు మంత్రాల నుంచి వచ్చింది. చౌ అనే పదం ఛాయ అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. ఈ నృత్యంలో అనేక విన్యాసాలు, యుద్ధానికి సంబంధించిన కదలికలతో పురాణాలకు సంబంధించినవే తీసుకుని చేస్తున్నారు. కళాకారులు అనేక రంగులతో కూడిన దుస్తులు, మాస్కులు వేషాలకు తగ్గట్టుగా ధరిస్తారు. ఈ నృత్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో వేదికల మీద రాత్రంతా ప్రదర్శిస్తారు. 2010లో యునెస్కో పురూలియా చౌని వారి జాబితాలో చేర్చుకున్నారు. కళాకారులు నిర్వహించిన మహిషాసుర మర్ధిని, అభి మన్యువధ, జానపద నృత్యాలు అలరించాయి. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, కుమార్, విశాల్, గణేష్, ప్రభాస్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధిని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



గడియారం సిద్ధం.. రండి చూసేద్దాం



సామర్లకోటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గడియారపు స్తంభం

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గడియార స్తంభం సెంటర్ అంటూ పలు ప్రధాన పట్టణాల్లో మారుమోగే కూడలి ప్రాంతం పేరు. అదే పేరిట సామర్లకోట స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్ వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భారీ గడియారపు స్తంభాన్ని నిర్మించాలని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన కృషి మూడవ దఫా గెలుపొంది నేటికి నిర్మాణపనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఎట్టకేలకు సదరు నూతన నిర్మాణ సెంటర్‌పై భారీ గడియారాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. మరో 2 రోజుల్లో లాంఛనంగా ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రాజప్ప సన్నాహాలు చేస్తున్నారు.

నాడు ఒరిగి... నేడు మెరిసి!



చింతూరు మండలం సింగన్నగూడెంలో 2 నెలల క్రితం అంగన్వాడీ భవనం దుస్థితి



నేడు రంగులతో మెరిసిపోతున్న అంగన్వాడీ భవనం

చింతూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు మండలం సింగన్న గూడెంలో 1998లో అంగన్వాడీ కేంద్రానికి భవనం నిర్మించారు. కాలక్రమంలో అది శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్‌కు కర్రలతో సపోర్టు ఇచ్చి నిర్వహించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ భవనానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించి రూ.3లక్షలు మంజూరు చేశారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ పర్య వేక్షణలో 2 నెల ల్లోపే పూర్తిస్థాయిలో ఆధుని కీకరించారు. మంగళవారం దానిని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పునః ప్రారంభించారు. ఎల్ఈడీ టీవీ, ఇంటర్‌నెట్, ఇతరత్రా సాంకేతిక హంగులు సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, తహశీల్దారు చిరంజీవి, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఐటీడీఏ ఈఈ మురళీ, ఏఈ తరుణ్, టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, నాయకులు సయ్యద్ ఆసిఫ్, మధు సూదనరావు, శంకర్, శీలం తమ్మయ్య, అంగన్వాడీ టీచరు లక్ష్మి పాల్గొన్నారు.

అన్నవరంలో భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన
- మంత్రిని కలిసిన ఆలయ ఈవో సుబ్బారావు



మంత్రికి సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాల కల్పనకు కృషిచేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం అన్నవరం ఈవో సుబ్బారావు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభి వృద్ధి పనులను మంత్రికి వివరించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్రమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దేవస్థానం వేదపండితులు మంత్రి, కమిషనర్‌కు వేదాశీర్వచనాలు అందించారు. వ్రత పురోహిత సంఘ నాయకులు నాగాభట్ల రవిశర్మ, కర్రి నాని, మహేంద్రవాడ జగదీష్, సవితాల వీరబాబు, నాగాభట్ల శంకర్,మణికంఠ ఉన్నారు.





షీల్డు, నగదు చెక్కులు అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

రాష్ట్ర స్థాయి పురోహిత క్రికెట్ విజేత కాకినాడ రుద్రాస్

- కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్

అమలాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఫైనల్స్‌లో కాకినాడ రుద్రాస్-కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ జట్లు తలపడగా.. కాకినాడ రుద్రాస్ విన్నర్‌గా, కొవ్వూరు గాయత్రీ లెవెన్స్ రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ సభలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కె.బుచ్చిరామ్ ప్రసాద్, ఏవీ రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈమని సూర్యనారాయణశర్మ, బ్రాహ్మణ సాధికార రాష్ట్ర అధికార ప్రతినిధి యామిజాల నరసింహమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు షీల్డులు, నగదు ప్రోత్సాహక చెక్కులు అందించారు. రాష్ట్ర పురోహితశాఖ గౌరవాధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ దుర్గాబాబు, పురోహిత సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి రాణి శ్రీనివాస్, కోనసీమ బ్రాహ్మణ సాధికార కన్వీనర్ సత్తిరాజు స్వామి, బోళ్ల వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆకొండి పవన్ పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో జాలర్లకు అవగాహన

కాకినాడ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ 49 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ స్టేషన్ ఆధ్వర్యంలో కోస్ట్ గార్డ్ అధికారులు స్థానిక బీచ్ రోడ్డులోని కుంభాభిషేకం గుడి వద్ద మంగళవారం సాయంత్రం సముద్రంలో వేట సాగించే జాలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేట సాగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించవల్సిన అంశాలు, తీరం హద్దుల పై అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి చెన్నైకి ఈస్ట్రన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన 34 మంది సిబ్బంది ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరి జాలర్లతో మమేకమై వేటాడే సమయంలో వచ్చే కష్ట, నష్టాల గురించి స్పష్టంగా వివరించారు. జాలర్లు వేట చేసే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే వెంటనే అలాంటి వారి గురించి తెలియజేయాలని సూచించారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- రాజమహేంద్రవరం డిపో నుంచి ఫిబ్రవరి 4, 14, 18 తేదీల్లో నడిపేందుకు ఏర్పాట్లు
- ఇప్పటికే టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా విక్రయం
- మరింత డిమాండ్ ఉన్నా బస్సులు సిద్ధం చేయలేని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసులు నడుపుతున్నట్టు డీఎం షేక్ షబ్నం తెలిపారు. ఇప్పటికే బస్సులను సిద్ధం చేసి టికెట్ల బుకింగ్ కూడా దాదాపుగా పూర్తి చేశారు. ఫిబ్రవరి 4,14,18 తేదీల్లో బస్సు లు బయలుదేరుతాయన్నారు. 4వ తేదీన మూడు, 14వ తేదీన రెండు, 18వ తేదీన రెండు బస్సుల్లో భక్తులు వెళతారని చెప్పారు. ఏడు రోజులు, పదకొండు రోజులుగా కుంభమేళా యాత్ర పూర్తయ్యేలా రెండు రూట్లలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉన్నా .. మరిన్ని బస్సులు నడపాలంటే కష్టమేనని, అందుకు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బస్సులోని ప్రయాణికులకు భోజనం, తదితర సదుపాయాలు కల్పించాలంటే బయట వ్యక్తులు అవసరం కానుంది. అందువల్ల సర్వీసులు నడపలేకపోతున్నట్టు తెలిసింది. ఈ యాత్రకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి ఒక్కొక్కరికి రూ. 10,000 టికెట్ ధరగా నిర్ణయించారు.

● ఆర్టీసీ వర్గాల్లో ఆనందం

టిక్కెట్లన్నీ ఇప్పటికే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆర్టీసీ దీనిపై పెద్దగా ప్రచారం చేయకపోయినా... బుక్ కావడంతో ఆర్టీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 4, 18వ తేదీన కుంభమేళా యాత్రకు వెళ్లే మొత్తం ఐదు బస్సుల టికెట్లు ఇప్పటికే బుకింగ్ పూర్తయిందని, 14వ తేదీన బయలుదేరే రెండు బస్సుల్లో ఒక బస్సుకు టికెట్ బుకింగ్ క్లోజ్ కాగా, రెండో బస్సుకు సైతం డిమాండ్ ఎక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుడి హుండీ లెక్కింపు

- 67 రోజులకు రూ. 34.67 లక్షల ఆదాయం



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి జంగా రామలింగేశ్వరరావు వ్యవహరించారు. మొత్తం 67 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల నుంచి నగదు రూ.33,43,400, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.1,24,100, వెరసి మొత్తం రూ.34 లక్షల 67,500 ఆదాయం వచ్చింది. అలాగే 409 గ్రాముల వెండి, 12 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను
సద్వినియోగం చేసుకోవాలి

- సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు వివిధ శాఖలలోని నిపుణులతో రెండురోజుల పాటు పంచాయతీ కార్యదర్శులకు అందిస్తున్న శిక్షణ తరగతులను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ ఆవరణలో అందిస్తున్న ఈ శిక్షణ తరగతులను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ వివరించారు. ఐదు జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీల కార్య దర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామ నాథం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి రావు, నిహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి.ఆంజనేయులు, పద్మజ, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 28(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లకు సంబంధించి పునఃపరిశీలన రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆసుపత్రుల్లో జరిగిన ఈ ప్రక్రియకు 198 మంది హాజరు కావాల్సి ఉండగా, 193 మంది మాత్రమే వచ్చారు . సోమ, మంగళవారాల్లో మొత్తం 378 సర్టిఫికెట్లను పరిశీలించారు.

నలుగురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

● పేకాట క్లబ్‌లకు అడ్డగోలుగా అనుమతులు ● ఇప్పటికే కమిషనర్‌పై వేటు
● విచారణ అనంతరం ఉద్యోగులపై వేటు ● కమిషనర్ ఇచ్చిన వాంగ్మూలంతోనే వేటు..!

యానాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో మున్సిపల్ శాఖ కు సంబంధించి నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు పుదుచ్చేరి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి.సౌందర్య రాజన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను యానాం మున్సిపల్ కమిషనర్, పరిపాలనాధికారికి పంపారు. యానాంలో రీక్రియేషన్ పేరుతో వచ్చిన పేకాట కేంద్రాలకు అడ్డగోలుగా ట్రేడ్ లైసెన్సుల అనుమతులు ఇవ్వడం అనంతరం ఈ విషయంలో లక్షలాది రూపాయలు చేతులు మారడం వంటి అంశాలపై విచారణ నిర్వహించిన అనంతరం ఉద్యోగులపై వేటువేశారు. గతంలో ఈ అనుమతులపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశంను ప్రభుత్వం గత సంవత్సరం జనవరి 21న విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈనేపథ్యంలో పుదుచ్చేరి నుంచి వచ్చిన ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో జరిగిన విచారణలో అడ్డగోలు అనుమతులను గుర్తించడంతోపాటు ఇప్పటికే సస్పెండ్‌కు గురైనా కమిషనర్ వాగ్మూలంతో వీరిపై వేటు వేసినట్లు సమాచారం. వీరిలో బిల్ కలెక్టర్లు ఎం.అప్పారావు, పి.దుర్గారావు, కె.సత్యనారాయణ, పి.ఉషారాణిలు ఉన్నారు. అదేవిధంగా రాయల్ రీక్రియేషన్ క్లబ్‌కు సంబంధించి అనుమతుల జారీ విషయంలో మరో ముగ్గురు ఉద్యోగుల(ఇద్దరు మహిళ, ఒక పురుషుడు)పై వేటు పడనుంది. ఈ అంశం ప్రస్తుతం యానాంలో తీవ్ర చర్చకు దారి తీసింది. వీటితో పాటు పారిశుధ్య పనుల విషయంలో ఫిర్యాదులు అందడంతో సీబీఐ స్థాయి విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో వీటిపై ఎంతమందిపై వేటు పడనుందనే అంశం ప్రస్తుతం యానాంలో హాట్ టాపిక్‌గా మారింది.

1న సీఎం చంద్రబాబు తూర్పు పర్యటన

» దొమ్మేరులో పేదల గృహ ప్రవేశం
» ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ
» జిల్లా కలెక్టర్ ప్రశాంతి


దొమ్మేరులో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాల్గోసారి సీఎం పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో పేదల కోసం నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించి, గృహప్రవేశాలు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను కూడా సీఎం స్వయంగా లబ్ధిదా రులకు అందజేస్తారు. అనంతరం అక్కడ హౌసింగ్ లబ్ధిదారులతో సభ నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్ తదతర అధికారులతో సమీక్షించారు. భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఆర్భా టాలకు దూరంగా, సాదాసీదాగా సీఎం పర్యటన ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. ముందుగా కలెక్టర్ మా ట్లాడుతూ 1వ తేదీన సీఎం చంద్రబాబు దొమ్మేరులో పేదల గృహ ప్రవేశ కార్యక్రమం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారన్నారు. అధికార్లంతా సమన్వయంతో వ్యవహరించి సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమానికి పూర్తి స్థాయి ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రోటోకాల్ వ్యవహారాలు ఆర్డీవో బాధ్యత వహిస్తారన్నారు. పోలీసులు లా అండ్ ఆర్డర్ చూ స్తారని చెప్పారు. కొవ్వూరు డివిజన్, నియోజకవర్గం, దొమ్మేరు గ్రామ పంచాయతీకి సంబంధించిన యాక్షన్‌ప్లాను సీపీవోకు, శానిటేషన్, మంచినీటి పనులను మున్సిపల్ అధికార్లకు ఇతర పనులను ఆయా శాఖలకు అప్పగించారు. ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతా రామమూర్తి, ఆర్డీవోలు రాణి సుస్మిత, కృష్ణనాయక్, హౌసింగ్ ఇన్‌చార్జికె.భాస్కర్ పాల్గొన్నారు.

అడివి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన విష్ణుదొర

గోకవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అడవిపంది దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ డ్డాడు. గంగవరం మండలం దోనేపల్లికి చెందిన బి.విష్ణుదొర మంగళవారం పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న అడివి పంది దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాధితుడు గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం 108 వాహనంలో గోకవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చమురు సంస్థలు పర్యావరణానికి విఘాతం కలుగకుండా
జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్


మోడేకుర్రులో ఓఎన్జీసీ సైటును పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చమురు, సహజవాయువులు వెలికితీత మూలంగా పర్యవరణానికి ఎటువంటి విఘాతం కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన న్యూ జనరేషన్ రిగ్గు స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ అమలులో భాగంగా ఏర్పాటుచేసిన ఆధునాతన రిగ్గు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ఈ రిగ్గు పనితీరంతా ఆటోమేటిక్‌గా ఆపరేట్ అవుతుందని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆధునాతన సాంకేతిక టెక్నాలజీతో పనిచేసే రిగ్గు మూలంగా పర్యావరణానికి ఎటువంటి హానీ కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఓఎన్జీసీ అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించవచ్చునన్నారు. ఓఎన్జీసీ అధికారులు స్థానికంగా ఈ ప్రాంత అభివృద్ధికి సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టేట్ సపోర్టు మేనేజర్ జి.శ్రీనివాస్, డోలా కిషోర్, ఆర్పీసింగ్, ఓఎన్జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి యువకుడి గల్లంతు



అల్లవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు, పాశర్లపూడి వైనతేయ బ్రిడ్జిపై యాక్సిస్ స్కూటీని వదిలిపెట్టి వైనతేయ గోదావరి నదిలో దూకి యువకుడు గల్లంతయ్యాడు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన జవ్వాది కృపాకిరణ్ (25) గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. చెన్నైలో విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కృపాకిరణ్ శనివారం చెన్నై నుంచి ఇంటికి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నైలో ఉద్యోగం చేసే సంస్థలో ఎదైనా గొడవపడి ఉంటాడని, వచ్చిన నాటి నుంచి మనోవేదనతో ఎవరితో మాట్లాడకుండా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.నాలుగు నెలల క్రితమే చెన్నైలో ఉద్యోగం వచ్చిందని, ఇటీవల సంక్రాంతికి వచ్చి వెళ్లి మళ్లీ వచ్చాడని తల్లి సీత అన్నారు. కృపాకిరణ్ తన స్కూటీని వదిలి బ్రిడ్జిపై నుంచి దూకేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో అల్లవరం పోలీసులకు సమాచారం అందించారు. తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడని ఆమె భర్త నాగేశ్వరరావు గతంలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకునియాక్సిస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జవ్వాది కృపాకిరణ్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేస్తున్నామని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పంట కాలువలో స్కూల్ బస్సు బోల్తా


పంట కాలువలో బోల్తా పడిన స్కూల్ బస్

● స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడిన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట పట్టణానికి చెందిన శ్రీ వివేకానందా స్కూల్ బస్సు దివిలి, వడ్లమూరు గ్రామాలకు చెందిన విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లే క్రమంలో వడ్లమూరు గ్రామానికి చేరుకునేసరికి రోడ్డు ఇరుకుగా ఉండడంతో బస్సు అదుపుతప్పి సమీపంలో ఉన్న పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఆ సమయంలో బస్సులో ఉన్న ఏడుగురు విద్యార్థులకు స్వల్పంగా గాయాలు కావడంతో వారు బస్సులో నుంచి విద్యార్థులు హాహాకారాలు చేశారు. సమీపం లో ఉన్న రైతులు వెంటనే అక్కడకు చేరుకుని వారిని రక్షించారు. రోజూ బస్సును నడిపే డ్రైవర్ సెలవు పెట్టడంతో తాత్కాలికంగా మ రో డ్రైవర్‌ను పాఠశాల యాజమాన్యం ఏర్పా టుచేయడంతో ఈ ప్రమాదం సంభవించి నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలా నికి చేరకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ విద్యార్థులను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించే ఏర్పాటు చేశారు. ఈ విషయంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారికి అడ్డంగా గేటు ఏర్పాటుపై వివాదం

● అడ్డుకున్న మహిళలపై పెట్రోల్ పోసిన వైనం
● కరప పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన


కరప పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గొడ్డటిపాలెం గ్రామస్తులు

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపమండలం గొడ్డటిపాలెం గ్రామంలో ఒక వ్యక్తి నలుగురు నడిచే దారికడ్డంగా గేటు ఏర్పాటుచేయడంపై వివాదం నెలకొంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొడ్డటిపాలెం గ్రామంలోని మాస్టారు గారి వీధికి చెర్పి నక్కా సత్యనారాయణ, అతని కుమారుడు బ్రహ్మాజీలు ఈనెల 23న గోడ కట్టి గేటు పెట్టే ప్రయత్నం చేశారు. దీనిపై అభ్యంతరం తెలిపిన పలు కుటుంబాల వారు అదే రోజు అధికారులకు ఫిర్యాదుచేశారు. అయినా పట్టించుకోకుండా రెండురోజుల క్రితం గేటు ఏర్పాటుచేశారు. అక్రమంగా గేటు ఏర్పాటుచేయడాన్ని తట్టుకోలేని వీధిలోని మిగిలిన కుటుంబాల వారు మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సహాయంతో గేటును తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన నక్కా బ్రహ్మాజీ పెట్రోల్ తీసుకువచ్చి అక్కడ మోహరించిన మహిళలపైన, ఎక్స్‌కవేటర్‌పైన చల్లాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. బాధిత మహిళలు, కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి కరప పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అక్రమంగా గేటును ఏర్పాటుచేయడమేగాక తమపై దాడిచేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఫిర్యాదుచేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. అయితే దీనిపై కరప పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించకపోవడం గమనార్హం.

కుమారస్వామిని హత్యచేసిన
నిందితులను శిక్షించాలి

» ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు


రాజోలులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

రాజోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ప్రాజెక్టు చెరువులో అదే గ్రామానికి చెందిన గుమ్మడి కుమారస్వామి మృతదేహం తేలియాడిన సంఘటన మంగళవారం పాఠకులకు విధితమే. కుమారస్వామి చెరువులో పడి మృతిచెందలేదని, తలమీద, పీక మీద దెబ్బలు ఉన్నాయని కుమారస్వామిని కొట్టి చంపి చెరువులో పడవేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజోలు సామాజిక ఆసుపత్రి వద్ద కుమారస్వామి కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. కుమారస్వామిని హత్యచేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 26న కుమారస్వామి కనిపించడంలేదని రాజోలు పోలీసుస్టేషన్‌లో కుమారస్వామి మామయ్య సారిక వెంకటశ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈనెల 28న మంచినీటి చెరువులో శవమై తేలాడు. కుమారస్వామిని కొట్టి హత్య చేశారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారని తెలిపారు. కుమారస్వామి కుటుంబ సభ్యులు నలుగురు అనుమానిత వ్యక్తుల పేర్లను పోలీసులకు తెలిపాడు. ఆ నలుగురిలో ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నామని, మిగతా ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. దీంతో కుమారస్వామి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేసిన
వీఆర్వో సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గండేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రం కోసం లంచం డిమాండ్ చేస్తున్న వీఆర్వోపై సోమవారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పం దించారు. ఈమేరకు వీఆర్వో సరుగోల సూర్యారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడజిల్లా గండేపల్లి మండలం లోని సూరంపాలెం గ్రామానికి చెందిన అడ్డల అనంతలక్ష్మి వారి పిల్లలకు సంబంధించి జనన ధృవీకరణ పత్రాల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

● 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దొంగల వివరాలను పోలీసులు వెల్లడించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు హౌ సింగ్ బోర్డు కాలనీకి చెందిన తోట శివ, యానాం జార్జ్ పేట మహాలక్ష్మికాలనీకి చెందిన షేక్‌బషీర్, రాజమహేంద్రవరం నారాయణపురం గెయిల్ కార్యాలయం వెనుక ప్రాంతం వాంబేకాలనీకి చెందిన కాపు అరుణసాయికుమార్‌లను పోలీసులు అరెస్టుచేశారు. ఈనెల 25వ తేదీ రాత్రి 11గంటల సమయంలో చౌడేశ్వరనగర్‌లో మంచలి నరేష్ అనే వ్యక్తి రాజానగరం నుంచి స్కూటీపై ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో రాత్రి ఈ ముగ్గురు దుండగులు అడ్డగించి కత్తితో బెదిరించి స్కూటీ లాక్కుని తన వద్ద ఉన్న రూ.4 వేలు లాక్కుని వెళ్లిపోయారని బాధితుడు బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తమకు వచ్చిన సమాచారంతో స్థానిక సీఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుంది. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

తునిలో ముగిసిన దివ్యాంగుల
రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

తుని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్ పారా వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. కాకినాడ జిల్లా తుని రాజా కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారా వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శివదత్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఒలింపిక్స్‌కి పంపించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విజయనగరం టీమ్ విన్నర్‌గా, శ్రీకాకుళం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్లకు విశాఖజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్‌తో కలిసి అసోసియేషన్ సభ్యులు బహుమతులు, నగదు చెక్కులు అందజేశారు. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయికి 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జనసేన పాయకరావుపేట నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్‌కుమార్, కాకినాడ కోలా సోమశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, జనసేన అనకాపల్లి జిల్లా సెక్రటరీ రాకెట్ గోవిందరావు, జాయింట్ సెక్రటరీ పురందాసు అప్పలరాజు, రాజీపేట ప్రెసిడెంట్ పిక్క స్వామి, బోడపాటి సతీష్, ఈవెంట్ ఆర్గనైజర్లు గోవిందు, శ్రీను, మధు, నాగశక్తి పాల్గొన్నారు.



దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

» బాధిత కుటుంబ సభ్యులు దేహశుద్ధి
» సెలవుపై వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు
» ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

కరప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక కార్యదర్శిగా సామాన్య ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంతోపాటు బాధ్యత కలిగిన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికను లైంగికంగా వేధించి కన్నవారి ఆగ్రహానికి గురయ్యాడు. బాధిత కుటుంబీకులు దేహశుద్ధి చేయడంతో అవమానభారంతో సెలవుపై వెళ్లిపోయాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వాకాడ మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీఎస్ రామారావు అదే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాదజత బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో కామాంధుడి భాగోతం బయటపడింది. ఈలోగా సదరు ఉపాధ్యాయుడు గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో ఈనెల 3న పాఠశాలలో ఇరువర్గాలను పిలిచి రాజీ ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బాలిక తల్లి కామాంధుడి ముఖంపై ఉమ్మివేసి నానా దుర్భాషలాడగా, బంధువులు దేహశుద్ధి చేశారు. జరిగిన విషయం బాహ్య ప్రపంచానికి తెలిస్తే తమ పరువుపోతుందని భావించిన బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేసినట్టు తెలుస్తోంది. పాఠశాల నుంచి సదరు ఉపాధ్యాయుడిని పంపించివేయాలని బాలిక కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో అతను సెలవుపై వెళ్లిపోయాడు. దీనిపై వివరణ కోరేందుకు మండల విద్యాశాఖాధికారిణికి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. జనవిజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీగా లెక్చర్లు ఇచ్చే రామారావు తనవద్ద చదువుకునే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంపట్లవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి ఉపాధ్యాయులపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖతీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

» చేయి, మెడపై గాయాలు
» ఆస్తి తగాదాలే కారణం

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త వీరంపాలెంలో ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి చెయ్యి, మెడపై తీవ్ర గాయాలయ్యాయి, రంగంపేట ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త వీరంపాలెంకి చెందిన మత్స సతీష్‌కి అదే గ్రామానికి చెందిన మత్స శ్రీనివాస్‌కి కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం సతీష్ తన ఇంటివద్ద భార్యతో ఉండగా శ్రీని వాస్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన సతీష్ చెయ్యి అడ్డుపెట్టడంతో బొటనవేలు, మెడపై గాయాలయ్యాయి, సతీష్ భార్య వెంటనే బంధువుల సహాయంతో అనపర్తి గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తనభర్తను చంపాలనే ఉద్దేశ ంతో కత్తితో దాడికి పాల్పడిన శ్రీని వాస్, ప్రోత్సహించిన అతని తండ్రి సుబ్బన్నను కఠినంగా శిక్షించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మరో యువకుడి మృతి

ముమ్మిడివరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై-జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో శనివారంరాత్రి నలుగురు యువకులు గాయపడగా వారిలో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మంగళవారం మృతి చెందాడు. అయినవిల్లి మండలం ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18) ఆదివారం మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో ఎరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్ (18), అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజులు ఒక మోటారుసైకిల్‌పై అమలాపురం వైపునుంచి ముమ్మిడివరం వస్తుండగా కాకినాడ నుంచి మలికిపురం వెళుతున్న గెద్దాడ మణికంఠ, నల్లి వంశీ మరో మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. అయితే వడ్డి సిరాజ్, గెద్దాడ మణికంఠలు చికిత్స పొందుతూ మృతి చెందగా ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

» రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు. ఐదు బైక్‌ల స్వాధీనం

భీమవరంటౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల 38 వేల రూపాయిల బంగారు ఆభణాలు, ఐదు మోటా రు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కాళ్ల మండలం సీసలిలోని ముగ్గళ్ల నర్సింహారావు ఇంటిలో దొంగతనానికి పాల్పడిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేశ్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేశామన్నారు. నిందితులను ఆకివీడు సీఐ వి.జగదేశ్వరరావు, ఎస్ఐ నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవి జిల్లాలోని ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, ఏలూరు జిల్లాలో నిలక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ప్రాంతంలో బంగారు గొలుసులు దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారన్నారు. కాళ్ల, ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్లను దొంగతనం చేశారన్నారు. జొన్నల వెంకటేశ్ ఆటోలు, బస్సులు కోసం ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడలోని బంగారు ఆభణాలు దొంగిలించే వాడన్నారు. నిందితులు వెంకటేశ్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.70 వేలు. జోష్ణదేవి ఖాతాలో రూ.1.80 లక్షలు సీజ్ చేశామన్నారు. ఈ కేసులో అట్టిక గోల్డ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబు ళ్లను అభినందించి నగదు రివార్డులను అందిం చారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పైపై మెరుగులతో నగరాన్ని మురికిగా మార్చిన వైసీపీ

అభివృద్ధి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



కల్వర్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గత వైసీపీ పాలకులు పైపై మెరుగులుదిద్ది దాన్నే అభివృద్ధి అని చెప్పి మురికిగా మార్చేసారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో 2, 4, 43, 44 డివిజన్ల పరిధిలో జరుగుతున్న కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వీటి పనుల తీరును ఆరా తీశారు. వీటి పనులు నాణ్యతతో చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమాన్ని చూసుకుంటూనే అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాయని, రూ.22.51 కోట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంకా రూ.3.90 కోట్ల పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. రూ.33.42 కోట్ల పనులు టెండర్ స్టేజీలో ఉన్నాయన్నారు. నగరానికి రూ.70 కోట్ల పనులు అవసరం పడ్డాయంటే గత పాలకులు ఏం చేయలేదని అర్థమన్నారు. రాజమహేంద్రవరాన్ని కల్చరల్, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆరోగ్యవంతమైన నగరం కోసం కృషి చేస్తున్నామన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట పంచాయతీ రామకృష్ణనగర్ చర్చివీధిలో జరుగుతున్న డ్రైనేజీ, రహదారి నిర్మాణ పనులను మంగళవారం టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ నిర్మాణంలో లోపాలు గుర్తించి డ్రైనేజీ స్లోయింగ్ మీద దృష్టిసారించాలని కాంట్రాక్టర్, ఇంజనీర్‌కు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుద్దుపూడి రామకృష్ణ, పెండ్యాల రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, వెలమటి రామకృష్ణ, అడపా గోపాలకృష్ణ చక్రయ్య పాల్గొన్నారు.



రామకృష్ణనగర్‌లో పనులు పరిశీలిస్తున్న డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్

హామీలు నిలబెట్టుకోకపోతే ప్రజాగ్రహం తప్పదు

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఏవైతే హామీలు ఇచ్చారో, వాటని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఏ జక్కంపూడి రాజా అన్నారు. ప్రకాశంనగర్‌లోని తమ స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అమలు జరిపిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంటు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కటి కూడా అమలు జరగటం లేదని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ఇస్తామని , నమ్మబలికి, ప్రజలతో ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం, వాటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కంపెనీ సెక్రటరీషిప్‌పై కామర్స్ విద్యార్థులకు అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న కామర్స్ విద్యార్థులకు కంపెనీ సెక్రటరీషిప్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ సెక్రటరీషిప్‌లో ఉజ్వలమైన కెరీర్ అవకాశాలను విద్యార్థులకు పరిచయం చేయడమే అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని బీబీఏ ప్రోగ్రామ్స్ స్ట్రీమ్ కో ఆర్డినేటర్, కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి బి.ప్రతిమ అన్నారు. సీనియర్ ఫ్యాకల్టీ పి.షణ్ముఖరావు కంపెనీ సెక్రటరీస్‌కు ఉన్న ఉద్యోగావకాశాలను వివరించారు. సభలో పి.అన్నపూర్ణ, వంశిక లూసియా కంపెనీ సెక్రటరీస్‌కు సంబంధించిన పలు అంశాలను తెలియజేశారు. కార్యక్రమానికి కామర్స్ విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ సమావేశాన్ని నిర్వహించారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

• గ్రామాల విలీనం తర్వాతే కార్పొరేషన్ ఎన్నికలు • రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలతో అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధిని ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ బృందం దావోస్ పర్యటనతో 6లక్షల కోట్లు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారన్నారు. దీంతో సుమారు నాలుగు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. జగన్ పాలనలో పారిశ్రామిక విధానాన్ని విచ్ఛిన్నం చేశారని దీంతో పెట్టుబడిదారులు పారిపోయారని విమర్శించారు. ప్రతి జిల్లాను యూనిట్‌గా తీసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ నేతృత్వంలో మల్టీలెవెల్ అభి వృద్ధి దిశగా ఎన్డీఏ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. విశాఖ కేంద్రంగా విజయ సాయిరెడ్డి వేలాది ఎకరాలు దోచుకున్నారని, ఆయన ఏ2 అనే సంగతి మరిచి పోతే ఎలా అని హేళన చేశారు. రాబోయే రెండేళ్లలో వైసీపీ ఖాళీ అయిపోతుందని జోస్యం చెప్పారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి అంబటి అసమర్థత వల్లే డయాఫ్రం వాల్ కొట్టుకు పోయిందని తెలిపారు. పంచాయతీల మెర్జింగ్‌లో కొన్ని ఇబ్బందులు వున్నాయని గ్రామాల విలీనం తర్వాతే కార్పొ రేషన్ ఎన్నికలు పెట్టాలన్నారు. కొందరు మేయరు సీటును ఆశిస్తున్నారని, ఇది సహజమేనని, అన్ని పార్టీల ప్రతినిధులు కూర్చొని నిర్ణయం చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షులు మత్యేటి శివసత్య ప్రసాద్, మార్ని వాసుదేవరావు, వెలుగుబంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

ఎమ్మెల్యే వాసును కలిసిన ఎస్టీయూ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మంగళవారం కలిశారు. బై ఎలక్షన్ కారణంగా మునిసిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు ఒకనెల ఆలస్యమైందని దీనివల్ల ఉభయగోదావరి జిల్లాల్లో ప్రమోషన్స్ పొం దిన మునిసిపల్ ఉపాధ్యాయులకు 24 సంవత్సరాలు స్కేల్ అమలులో సమస్య వస్తోందని, ప్రమోషన్స్ నోటిఫికేషన్ జారీ అయిన నవంబరు 9 నుంచి మోనిటరింగ్ బెనిఫిట్స్ ఇప్పించాలని కోరారు. పదోన్నతి పొందిన వారిని రిలీవ్ చేసి హైస్కూల్‌లో సబ్జెక్ట్ కొరతను, పరిపాలనపరమైన సమస్యలను తొలగించాలని, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సదుపాయం, నగరపాలక సంస్థలో మునిసిపల్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మోరంపూడి సిటీ యూపీ, శ్యామలాంబ పాఠశాలలను హైస్కూల్‌గా ఉన్నతీకరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డీఎస్ఎస్ మూర్తి, దానియేల బాబు, లక్ష్మణ పాల్గొన్నారు.

రేపటి నుంచి సూర్యారాధన

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొంతమూరు పద్మాక్షీనగర్‌లో నవమి వార్షిక పక్ష దీక్షా శతచండీ సహిత సూర్యారాధన గురువారం నుంచి ఫిబ్రవరి 12 వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు వడలి కుమార్‌శర్మ మంగళవారం తెలిపారు. ప్రతిరోజూ త్రిచ, మహాసౌర, అరుణ, సూర్య నమస్కారాలు జరుగుతాయని, ఫిబ్రవరి 4న రథసప్తమి, సూర్యజయంతి సందర్భంగా పంచామృతాభిషేకం, విశేష పుష్పాలతో అర్చన ఉంటాయన్నారు.

ఔత్సాహిక కళాకారులకు ఆడిషన్స్



మా ఏపీ, గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాకారులకు ఆడిషన్స్ దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకన్య గ్రాండ్‌లో మా ఏపీ, గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్ధమాన కళాకారుల పరిచయం, ఆడిషన్స్ నిర్వహించారు. దీనికి ప్రముఖ హాస్య నటుడు, మా ఏపీ అధ్యక్షుడు గౌతమ్‌రాజు అధ్యక్షత వహించగా జబర్దస్త్ ఆర్టిస్ట్ హరిబాబు, స్టేజ్ ఆర్టిస్ట్ గవరాజు, చంద్రరావు, జీబా ఫౌండర్ మహేష్, ప్రెసిడెంట్ డీఎస్ఎస్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ చక్రధర్, ట్రెజరర్ పిచ్చుక మహేష్, సెక్రటరీలు సురేంద్ర, కన్వీనర్ గిరిజాల సోమరాజు నాయుడు, రామసాయి, బొంతు వెంకటరాజు, కృష్ణకిశోర్ పాల్గొన్నారు. గౌతంరాజు మాట్లాడుతూ మా ఏపీ సంస్థ ద్వారా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించి వారికి సినీ పరిశ్రమలో అవకాశం కల్పించడానికి కృషి చేస్తానన్నారు. సుమారు ఎనభై మంది కళాకారులు హాజరై ఆడిషన్ వివరాలిచ్చారు.



మహిళా హ్యాండ్‌బాల్ పోటీలలో నిలిచిన ఎస్‌కెవిటి కళాశాల విద్యార్థినులు

మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎస్‌కేవీటీకి మూడోస్థానం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఎస్‌వీవీఎస్‌డీ కళాశాలలో 27, 28 తేదీల్లో నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో జరిగిన మహిళా అంతర్ కళాశాల మహిళా హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ పోటీల్లో విద్యార్థినులు మూడో స్థానంలో నిలిచినట్టు ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణ మూర్తి మంగళవారం తెలిపారు. ఫిబ్రవరిలో తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయం సౌత్‌జోన్ పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం తరపున ఎల్.వైష్ణవి, ఎస్.పూజ, ఎం.అశ్విని, విద్యార్థినులు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పీఏ కిషోర్‌బాబు, జి.శరత్‌బాబు, డాక్టర్ వైస్వర్ణశ్రీ, పీవీటీ సంజీవరావు, ఎం.ఫణికుమార్, ఎం.శిల్పారాణి తదితరులు అభి నందించారు.

3న చలో నెల్లూరు సభను జయప్రదం చేయాలి

ఫిబ్రవరి 1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరగనున్నాయని దీన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టీ.అరుణ్ కోరారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3న చలో నెల్లూరు పేరుతో జరిగే బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. ముఖ్య వక్తలుగా అఖిల భారత నాయకులు బృందాకరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు, బి.పవన్, పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో అన్న సమారాధనలో వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

అన్న సమారాధన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వృద్ధులకు వృద్ధాశ్రమం పెట్టాలనే ఆలోచనలో ఉన్నామని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన జరిపారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి భోజనాలు వడ్డించారు. ఆయన మాట్లాడుతూ సాయిరామ మందిరం 32వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, వస్త్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశయన కులస్తులకు మద్యం షాపులు కేటాయించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయింపులో శ్రీశయన కులస్తులకు అన్యాయం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ శ్రీశయన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోడా అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం తాము పొందుతున్న శ్రీశయన కుల ధ్రువపత్రాల ప్రకారం మద్యం దుకాణాలు కేటాయించాలని లోడా అప్పారావు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం

అనపర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8వ తేదీన హైదరాబాద్ జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్ విష్పర్ వ్యాలీలో జరగనున్న తన కుమారుడు మనోజ్‌రెడ్డి వివాహానికి హాజరు కావాలని మంగళవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి నారా లోకేష్‌ను కలిసి శుభలేఖ అందించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.



లోకేష్‌కు శుభలేఖను అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజానగరంలో జాబ్‌మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు

రాజానగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 31 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించినట్టు ఏపీఎస్ ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ పెరుమాళ్లరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం మూడు కంపెనీలు పాల్గొన్నాయని, 59 మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 31 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. ఏపీఎస్ ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రియ, తూర్పుగోదావరి జిల్లా ఉపాధి కల్పన సంస్థ నుంచి జేతు రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రంగంపేట, రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట ఎక్సైజ్ స్టేషన్లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసులు ఏవిధంగా నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలుసూచనలు చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో ఎక్సైజ్ సీ.ఐ సుధ, ఎస్ఐ దుర్గాప్రసాద్, స్టేషన్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



రంగంపేటలో రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : సీఐ



బిక్కవోలులో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుమంత్

బిక్కవోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాలని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. బిక్కవోలు వంతెన వద్ద మంగళవారం ఆయన విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ వాహన తనిఖీలు చేపట్టారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, ఫోర్ వీలర్స్ వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు యూనిఫాం, ఇన్సూరెన్స్ కలిగి వుండాలన్నారు. ఈయన వెంట బిక్కవోలు ఎస్ఐ వి. రవిచంద్ర కుమార్, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సుభద్రంపేటలో ఉచిత పశువైద్యశిబిరం

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుభద్రంపేటలో రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 120 పశువులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు రంగంపేట, వడిశలేరు పశువైద్యాధికారులు జహంగీర్, జాన్‌పాల్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కూటి సాయి తాతారావు, ఎన్డీయే కూటమి నాయకులు పూసల శ్రీను, ఆవుపాటి కృష్ణ, 63 మంది రైతులు, పశువైద్య సహాయకులు మురళీబాబు, శివప్రసాద్, జేమ్స్, తులసీరామ్, రాణి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు, వైద్యాధికారులు

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల ఇండస్ట్రీయల్ పార్కుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఏపీఐఐసీ అధికారులకు సూచించారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలంటే ముందుగా ఇన్‌ఫ్రాను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే మార్చి నాటికి రోడ్లు, కల్వర్టులు, డ్రైన్‌లు పూర్తిచేయాలని ఆదేశించారు. నీటి సదుపాయం, విద్యుత్, తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు. జనసేన నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

మార్చి 1 వరకు అఖండ మహా సౌర్య యాగం

- సన్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు విక్రమాదిత్య



విలేకరులతో మాట్లాడుతున్న విక్రమాదిత్య

అనపర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం ఈనెల 30 నుంచి మార్చి 1 వరకు అనపర్తిలో అఖండ మహాసౌర్య యాగం నిర్వహిస్తున్నట్టు సన్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు విక్రమాదిత్య (నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి) తెలిపారు. మంగళవారం అనపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ... ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతగా అనపర్తిలోని వెంకటరత్నపురంలో సత్తిరెడ్డి కిరాణా షాపు వద్ద ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 30 రోజుల పాటు ప్రతిరోజూ నాలుగు గంటల పాటు యాగం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ వచ్చి సూర్యభగవానుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సర్వేజన సుఖినోభవంతు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ హైదరాబాద్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ పురస్కారాలు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మట్టిలో మాణిక్యంలా దాగి ఉన్న సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, వృద్ధులు, మానసిక దివ్యాంగుల కరోనా సేవకులు, యోగా, మెడిటేషన్, సంగీతం, నృత్య గురువులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికులు, కర్షకుల సేవలను గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

దీనికి దరఖాస్తు చేసుకునేవారు వారి ప్రతిభను గుర్తించిన ధ్రువపత్రాలు, పేపరు క్లిప్పింగ్‌లు, నాలుగు ఫొటోలతో జిరాక్సులు దరఖాస్తుకు జతచేసి వచ్చేనెల 5వ తేదీలోగా పోస్టు చేయాలన్నారు. సర్వేజన సుఖినోభవంతు కార్యాలయం డోర్ నెం 1-20-164 గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి సికింద్రాబాద్-15 అడ్రస్‌కు పోస్టు చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 9652347207ను సంప్రదించాలని సూచించారు.

అదృశ్యం కేసులపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన పిల్లల కేసులు, తదితర అంశాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అక్రమ రవాణాకు ముఖ్యకారాణాలు వివరించారు. కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపకపోవడం, అదే సమయంలో వివిధ సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో స్నేహల వల్ల అక్రమ రవాణాకు గురౌతున్నారని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని అలా తప్పిపోయిన పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందని గుర్తుచేశారు. తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, అక్రమ రవాణా గురవుతున్న బాధితులను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవలసిన చర్యలు, అటువంటి బాధితులకు అందుబాటులో ఉన్న న్యాయసేవలపై వివరించారు. నల్సా వారి అక్రమ రవాణా బాధితులు వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం-2025 ద్వారా అందిస్తున్న సేవల గురించి తెలిపారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలకు సంబంధించిన కేసుల్లో ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయసేవాధికార సం స్థను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఎస్ఐ ఎల్.కనకరాజు, మహిళా పీఎస్ ఎస్ఐ పి.నాగరత్నం, పోలీస్ అధికారులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

రాజానగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. రాజానగరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు అనే నినాదంతో అవగా హన సదస్సు నిర్వహించారు. దీనికి హాజరైన జడ్జి మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు సంక్ర మించాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు బీ.పద్మావతి, వీ.సుజాత లైంగిక వేధింపులు, పోలీసులకు ఏవిధంగా సమాచారం అందజేయాలనే అంశాలపై వివరించారు. సైబర్ నేరాలు, గృహహింస, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా, సమాన పనికి సమాన వేతనం, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కె.విజయ కుమారి, సీడీపీవో టి.నాగమణి, ఏసీడీపీవో కనకవల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీసీపీవో యూనిట్ సిబ్బంది, మహిళలు, కూలీలు, వ్యవసాయ కూలీలు, తాపీ పనివాళ్లు, చేపల దుకాణదారులు, చిరు వ్యాపారులు, ఇళ్లల్లో పనిచేసే మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

కణుపూరు కొండ రోడ్డుకు డీపీఆర్ సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే



అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కణుపూరు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి కొండకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు గాదరాడలో టూరిజం అండ్ ఆర్అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. అలాగే రాజానగరం నియోజకవర్గంలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. కణుపూరు కొండకు రోడ్డు మార్గం, కొండ దిగువన అర్ధనారీశ్వరి విగ్రహం, తదితర పనులకు డీపీఆర్ పొందుపరచాలని పేర్కొన్నారు.

● ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష

రాజానగరం నియోజకవర్గంలో రూ.2.87 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో కీలకమైన రోడ్లను ఆర్అండ్‌బీ నాబార్డు గ్రాంట్‌తో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఎన్‌డీబీ రోడ్ల పనులు ఎస్ఈ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లతో మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న గోదావరి పుష్కరాల కంటే ముందుగానే నియోజకవర్గ రోడ్లు పనులు అన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ డీఈ సతీష్‌బాబు, ఏఈలు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

● బాధితుడికి ఎమ్మెల్యే బత్తుల భరోసా


రాజానగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అండగా ఉంటుంది, అధైర్యపడొద్దని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బాధితుడికి భరోసా ఇచ్చారు. పాతవెలుగుబందకి చెందిన పెద్దిశెట్టి సూరిబాబు పశువుల పాక అగ్నిప్రమాదానికి గురైంది. అందులో రెండు గేదెలు ఉన్నాయి. ఒకటి పూర్తిగా, రెండోది దాదాపు 30 శాతం కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంగళవారం వెళ్లి బాధితుడ్ని పరామర్శించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, తహసీల్దారు జీ.ఎల్ఎస్ దేవి, మండల పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం.అరుణ, రాజానగరం ఎస్ఐ మనోహర్ కూటమి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సొంత వైద్యం తగదు : ఏడీఏ

బిక్కవోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాధులకు గురైనప్పుడు పాడి రైతులు సొంత వైద్యం చేయడం మానుకోవాలని అనపర్తి ఏడీఏ డాక్టర్ వై. శ్రీనివాసరావు సూచించారు. కాపవరంలో మంగళవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కూటమి నేత కొట్టు సత్తిబాబు ప్రారంభించారు. ఇందులో భాగంగా పశువులకు నట్టల నివారణ మందులు, చికిత్సను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు చక్రరావు, సత్యంశెట్టి మణికంఠ, మండల వైద్యులు ప్రణీత్, రవికుమార్, వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కాపవరంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న కూటమి నేతలు, వైద్యులు





తూర్పుగోదావరి జిల్లా



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

కోనసీమ జిల్లా



అమలాపురంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు

కాకినాడ జిల్లా



పిఠాపురంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ

అక్షర.. వారధి!

అక్షరం ఏం చేయగలదు!? ప్రతి రోజూ పాఠకులకు తాజా తాజా వార్తలు చేరవేస్తుంది..అంతే..! ఇది నిన్నటి వరకూ ఉన్న ఒక వాదన.. అదేం కాదు..? 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' అక్షరం ఏం చేయగలదో నిరూపించింది.. జనగళమై ప్రజలకు ప్రజా ప్రతినిధులు . అధికారులను చేరువచేసింది.. వారధిగా మారి ప్రజా సమస్యల గళం వినిపించింది.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మూడో వార్డు, కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డులో మంగళవారం ఉదయం అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా సభలను నిర్వహించారు. ఈ సభలకు పెద్ద ఎత్తున జన స్పందన లభించింది.. ఆయా ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం హాజరై సమస్యలపై గళమెత్తారు. రాజమహేంద్ర వరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అమలాపురంలో కమిషనర్ రాజు, పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జి వర్మ, కమిషనర్ కనకారావు వాటిని విని పరిష్కరిస్తామని అక్కడికక్కడే హామీలు ఇచ్చారు.



అక్షరం కదిలించింది..
అండగా నిలిచింది!

ఇదీ సార్ సమస్య: రోడ్డు నిర్మించరు.. డ్రైనేజీ లేదంటూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎస్ఈ పాండురంగారావుకు సమస్యలు విన్నవిస్తున్న మాధవవర్మ





వేదికపై ఎమ్మెల్యే వాసు చిత్రంలో రంగబాబు, ఎస్ఈ పాండురంగారావు, వినూత్న, చండీప్రియ, బీఎం శ్రీనివాసరావు

ప్రజాగళమై.. ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి మరో అడుగు

- అక్షరం అండగా సభకు విశేష స్పందన
- రాజమండ్రి 9వ డివిజన్‌లో నిర్వహణ
- 200 మందికి పైగా హాజరు
- పలు సమస్యలపై విన్నపాల వెల్లువ
- అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే వాసు
- 25 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ

రాజమహేంద్రవరం/సిటీ/అర్బన్/రూరల్/కడియం/రాజానగరం/గోకవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : అక్షరం అండగా నిలిచింది..జనగళమై కదిలింది.. ప్రజా వాణి విని పించింది..సాధారణ జనం ఎమ్మెల్యే స్థాయి నాయకులను కలిసి సమస్యను చెప్పుకోవాలన్నా కష్టమే. దానికి ఎన్నో సిఫారసులు ఉంటేనే కానీ కలవడం.. సమస్యను చెప్పుకోవడం కష్టమే. అందుకే ఆంధ్రజ్యోతి మరో కొత్త అడుగు ముందుకేసింది..ప్రజలు..ప్రజా ప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి సమ స్యల పరిష్కారానికి బాటలు వేస్తున్నది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధి 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్ ఐఎంఏ హాలులో మంగళవారం నిర్వహించిన అక్షరమే అండగా పరిష్కారమే అజెండాగా సభకు విశేషస్పందన కనిపించింది. కాలనీ నుంచి సుమారు 200 మంది ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించారు. తొలుత ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సభ ముఖ్యోద్దేశమని తెలిపారు. సమస్య పరిష్కరించే వరకూ ఆంధ్రజ్యోతి నాయకుల వెంటపడు తూనే ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏబీఎన్- ఆంధ్రజ్యోతి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల వెంకటేశ్వనగర్‌లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. కల్వర్టుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయిస్తామన్నారు. డ్రైనేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. నగరపాలక సంస్థ ఎస్ఈ జి.పాండురంగా రావు మాట్లాడుతూ 9వడివిజన్‌లో డ్రైనేజీ, రహదారుల సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. పార్కులకు సంబంధించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.ఈ మేరకు బుధవారం పార్కులను పరిశీలిస్తామన్నారు. బీజేపీ నాయకుడు యెనుముల రంగబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ మాట్లాడుతూ ప్రజలకు.. ప్రతిప్రతినిధులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి నిలవడం అద్భుత ఆలోచన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈలు పి.రీటా,వాటర్ సప్లయిస్ ఈఈ మాధవి,డీఈలు లోవరాజు,సత్యనారాయణ, ఆర్‌వో సీహెచ్ శ్రీనివాసరావు,శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎ. మాధవవర్మ,పార్కు అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ ప్రభాకర్,ఏబీఎన్-ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు ఎస్ఎస్ఎన్.సత్యనారాయణ,కె.రాజబాబు,జర్నలిస్టులు ఎంబీవీ.సారధి,కె.శ్రీకాంత్,వీర్రాజు, బెజవాడ శంకర్, దాసరి రామచంద్రరావు,పి.దుర్గారావు,ఏవీ.దొర పాల్గొన్నారు.

కాలనీకి అంగన్‌వాడీ సెంటర్ కావాలి

డివిజన్‌కు అదనంగా అంగన్వాడీ సెంటర్ కావాలి. సచివాలయాలు దూరంగా ఉన్నా యి..కాలనీకి చేరువ చేయాలి. శానిటేషన్ సిబ్బంది మస్తరు వేసుకోవడానికి కార్యాల యం ఏర్పాటు చేయాల్సి ఉంది.కనీస సౌకర్యాలైన రోడ్లు డ్రైనేజీ, తాగునీరు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలి. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి ఆలోచన బాగుంది.
- కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్

ప్రధాన సమస్యల ఏకరవు..

వెంకటేశ్వరనగర్ కాలనీ వాసులు పలు ప్రధాన సమస్యలు విన్నవించారు.. డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి.దోమలు బెడద పెరిగింది.. రాత్రివేళలో పార్కులపై నిఘా పెట్టాలి..వీధి దీపాల సమస్యలు ఉన్నాయని మాధురి అన్నారు. కుక్కలు అధికంగా ఉన్నాయి. అవి పార్కుల్లోకి వెళ్లి పిల్లలపై దాడి చేస్తున్నాయని జవహర్ క్లబ్ సభ్యుడు డి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. బర్మాకాలనీలో కుక్కలు, పందులు అధికంగా ఉన్నాయని ఎస్‌వీ.సరస్వతి తెలిపారు.లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని ఈశ్వరరావు వేడుకున్నారు.రోడ్డు-4లోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని శ్రీమణి వాపోయారు. కమ్యూనిటీ భవనాలు సచివాలయాలుగా వినియోగిస్తున్నారని గొలుగూరి వెంకటరెడ్డి తెలిపారు. పార్కులో సౌకర్యాలు కల్పించాలని కాశి విశ్వనాథరాజు, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి ఏ.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్యే విన్నారు.. పరిష్కారం చూపారు..



రంగబాబు



పాండురంగారావు



వినూత్న



చండీప్రియ

గత వైసీపీ ప్రభుత్వం రహదారులు, డ్రైనేజీలను నిర్లక్ష్యం చేసింది. మా కూటమి ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలు చేస్తుంది..సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం.25 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బర్మాకాలనీలో రూ.60 లక్షలతో తాగునీటి సదుపాయాలు కల్పించాం. రూ.2.90 కోట్లతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ వచ్చే నెలాఖరు పూర్తవుతుంది.పందుల బెడదకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని కమిషనర్‌తో చర్చిస్తున్నాం.పారిశుధ్య మెరుగుదలకు 25 వాహనాలు కొనుగోలు చేశా ం.59 మంది శానిటేషన్ సిబ్బందిని నియమించాలనిప్రతిపాదనలు పంపించాం. బర్మాకాలనీకి చెందిన వారి రిజర్వేషన్లు విషయమై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి చొరవచూపుతా. విద్యుత్ స మస్య పరిష్కారానికి 50 ట్రాన్స్‌ఫార్మర్లు,రెండు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నాం.

బర్మా నుంచి వచ్చాం.. కుల సర్టిఫికెట్ కావాలి..

శ్రీలంకలోని బర్మా నుంచి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నా. అనేక ఏళ్ల నుంచి ఉంటున్నా పర్మినెంట్ కుల సర్టిఫికెట్ ఇవ్వడంలేదు. కుల సర్టిఫికెట్ ఇప్పించాలి.జమున ఎంపీగా పనిచేసిన సమయంలో మాకు ఇచ్చిన ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ కాలేదు. **- పొన్నుస్వామి రంజిత్, బర్మాకాలనీ**

గోదావరి నీళ్లు 10 నిమిషాలే వస్తున్నాయి..



గోదావరి నీరు పది నిమిషాల కంటే ఎక్కువ సేపు రావడంలేదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది.నీరు సక్రమంగా సరఫరా చేయాలి.పార్కు నిర్వహణ అంతంతమాత్రమే.
- రాజు పరమేశ్వరి, బర్మాకాలనీ, 5వ వీధి

మీటింగ్ పెట్టుకోవడానికి పార్కులో చోటివ్వడంలేదు..



మహిళలు మీటింగ్ పెట్టుకోవడానికి పార్కులో చోటు ఇవ్వడంలేదు. వేరొకరికి ఇస్తున్నారు. మేము మీటింగ్ పెట్టుకోవ డానికి పార్క్‌లో స్థలం ఎందుకు కేటాయించడంలేదు.
- కట్టా తనూజ, బర్మాకాలనీ, 4వ వీధి

రోడ్డు తవ్వేసి వదిలేశారు..



మా ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా రోడ్డు తవ్వేసి వదిలేశారు. ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియడంలేదు.
- నక్కా అప్పారావు, హెరిటేజ్ అపార్టుమెంట్స్

రోడ్డు కంటే డ్రెయినేజీ ఎత్తుగా ఉంది..



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యవస్తంగా మారింది. పూడికతో నిండిపోతోంది. డ్రైనేజీ ఎత్తు పెరిగింది. రోడ్డు పల్లంగా ఉంది. ఒక పక్క డ్రైనేజీ పూర్తిచేసి మరో పక్క అసంపూర్తిగా వదిలేశారు. **- ఏవీ.సత్యనారాయణ, కుక్కల ఆసుపత్రి వీధి**

రెంటల్ వేల్యూపై పన్ను వేయాలి



గత ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులు దారుణంగా పెంచేశారు. కూటమిలో అదే కొనసాగుతోంది. ప్రాపర్టీ వేల్యూ మీద కాకుండా రెంటల్ వేల్యూమీద పన్ను వేయాలి. **- కేఎస్‌వీ రఘురాం, ఐఎంఏ వీధి**



వేంకటేశ్వరనగర్ ఐఎంఏ హాలులో నిర్వహించిన సభకు హాజరైన 9వ డివిజన్ కాలనీ వాసులు, అధికారులు



జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 298 మంది మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై మంగళవారం రాజమహేంద్రవరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయం నుంచి సెంట్రల్ జైలు మీదుగా కంబాలచెరువు, ఆర్యాపురం, పేపర్‌మిల్లు, గోదావరి బండ్, డీలక్స్ సెంటర్, బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, తిలక్‌రోడ్డు, లాలాచెరువు సెంటర్ మీదుగా తిరిగి రవాణాశాఖ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ సాగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత జెండా ఊపి బైకు ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురైనపుడు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు. 2023లో 849 రోడ్డు ప్రమాదాలు జరిగితే 329 మంది చనిపోయారని, 2024లో 728 ప్రమాదాలు జరిగితే 298 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సేకరించిన 550 హెల్మెట్లను వాహనదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. బైక్ కొనుగోలు సమయంలో హెల్మెట్ తీసుకుంటున్నా ఆ తర్వాత వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడం విచారకరమన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి జిల్లా రవాణాశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, ఎంవీఐలు, ఏఎంవీఐలు, అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న సీఎం చంద్రబాబు పర్యటన

కొవ్వూరు, అనపర్తి నియోజకవర్గాల్లో ఏర్పాట్లు



దొమ్మేరులో కాలినడకన పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆర్‌డీవో రాణిసుస్మిత, సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని తదితరులు

కొవ్వూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి ఒకటో తేదీన జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు టౌన్,మండలంలోని దొమ్మేరు గ్రామాల్లో మంగళవారం స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఆరికిరేవుల రోడ్‌లోని స్పెక్ కాలనీ లేఅవుట్, కొవ్వూరుటౌన్ పరిధిలోని సీఎన్‌జీ గ్యాస్ బంకు వెనుక ప్రైవేటు లేవుట్, గామన్ బ్రిడ్జి వద్ద లే అవుట్, దొమ్మేరు పెట్రోల్ బంకు వద్ద ప్రైవేటు లే అవుట్, దొమ్మేరు గ్రామంలో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించారు.అనంతరం కొవ్వూరు, దొమ్మేరు గ్రామాల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రాజబాబు పర్యటించారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లకు సంబంధించి పూర్తి వివరాలు ఖరారు చేసి వెల్లడించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి సంబంధించి ఫిబ్రవరి ఒకటో తేదీన కొవ్వూరు నియోజకవర్గంలో సీఎం పర్యటన ఖరారైందన్నారు. పర్యటనను అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, జేసీ ఎస్.చిన్నరాముడు,ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, కలగర సుబ్బారావు, గారపాటి రామకృష్ణ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ కె.భాస్కర రావు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత,డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐలు కె.జగన్మోహనరావు, కె. శ్రీహరిరావు ఉన్నారు.

సీఎం కొవ్వూరు పర్యటన ఇలా..

కొవ్వూరు మండలం దొమ్మేరు ఐబీపీ పెట్రోల్ బంకు కాలనీని ఆనుకుని ఉన్న ప్రైవేటు లేఅవుట్‌లో హెలిప్యాడ్ వద్ద ఉదయం 10 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్‌లో దిగు తారు.అక్కడ నుంచి కారులో దొమ్మేరు చేరుకుని 1 గంట వరకు పర్యటిస్తారు. నీలాలమ్మ గుడి సమీపాన ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. సచివాలయం సమీపంలోని సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రక్కన చెట్టు వద్ద రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొంటారు. గత ఐదేళ్లుగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖాముఖి తెలుసుకుంటారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరును వివరిస్తారు.

అనపర్తిలో పరిశీలన..

అనపర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల మొదటి వారంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అనపర్తి శివారు కొత్తూరు కాలనీలో పర్యటిస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు కాలనీని మంగళవారం కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కెనాల్ రోడ్డు నుంచి కాలనీ వరకు ఉన్న దూరం అదే విధంగా కొత్తూరు వద్ద ఉన్న రైల్వే గేటును పరిగణనలోకి తీసుకున్నారు. గ్రామానికి కాలనీకి ఉన్న దూరాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి.కృష్ణనాయక్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ దివ్య, ఎస్‌బి డీఎస్పీ రామకృష్ణ,ఎంపీడీవో రామకృష్ణారెడ్డి,తహశీల్దార్ అనిల్‌కుమార్,ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, అనపర్తి సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ పాల్గొన్నారు.



హైవేపై అధికారులతో చర్చిస్తున్న గోరంట్ల

పుష్కరాలకు రోడ్ల విస్తరణ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పుష్కరాల నాటికి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నివారణకు ప్రణాళికలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. జాతీయ రహదారుల విభాగం పీడీ సురేంద్రనాథ్ బృందంతో కలిసి మంగళవారం మోరంపూడి నుంచి కడియపులంక వరకు జాతీయ రహదారిపై పలు ప్రాంతాలను పరిశీలించారు. త్వరలో మోరంపూడి నామవరం రోడ్ నాలుగు లైన్లుగా విస్తరిస్తామన్నారు. మోరంపూడి జంక్షన్ నుంచి ఫ్లైఓవర్ చివరి వరకు ఆక్రమ ణలు తొలగించి సర్వీస్ రోడ్డు వెడల్పు చేయాలన్నారు. హుకుంపేట జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డుతో పాటు డ్రైన్ పనులు చేపట్టాలని, ఈస్ట్ రైల్వే రోడ్డు 4 లైన్లుగా విస్తరించి డీమార్ట్ వద్ద ఉన్న 100 అడు గుల సర్వీస్‌కు కలపాలన్నారు.హుకుంపేట జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ అన్సారి, బ్రిడ్జి ఇంజనీర్ మహేష్, ఏఎస్ ఎంఈ రాహుల్, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, డీజీఎం రమణ పాల్గొన్నారు.

'మంద కృష్ణకు పద్మశ్రీ'పై హర్షం


వేలివెన్నులో హర్షం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

ఉండ్రాజవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల వేలివెన్నులో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సామాజిక వర్గ ప్రజలు మంగళవారం రాత్రి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు మండవల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమనేతగానే కాకుండా సామాజిక ఉద్యమనేతగా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎస్సీలోని 59 ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా అందేలా 30ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఇటువంటి నేతకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం సముచితమన్నారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దాసు, అనిల్‌కుమార్, ప్రసాద్, వైవీరావు, శ్రీనువాసు, వెంకట్రావు, మాదిగ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

కల్లుగీత కులాలకు 2 మద్యం షాపులు

కొవ్వూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో రెండు మద్యం షాపులను కల్లుగీత కులాలకు కేటాయించినట్టు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. చాగల్లు మండలంలో 1, తాళ్లపూడి మండలంలో 1 షాపు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. బీసీ (శెట్టిబలిజ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7న లక్కీ డ్రా జరుగుతుందన్నారు. అభ్యర్థులు బీసీ శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానికత ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు.

35మందికి పశువుల షెడ్లు మంజూరు


సత్యవాడలో షెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీఏ కాంతారావు

ఉండ్రాజవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకంలో 35 మందికి పశువుల కొట్టాలు(షెడ్లు) మంజూరైట్టు మండల ఉపాధి హామీ పథకం టీఏ జి.కాంతారావు మంగళవారం తెలిపారు. వీటిలో ఇప్పటికే 20 పూర్తయినట్టు చెప్పారు. సత్యవాడలో 3, పాలంగిలో ఒకటి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇంకా మండలంలో 11 నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందన్నారు. సత్యవాడలో షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనులు త్వరగా పూర్తి చేయాలని కాంతారావు పేర్కొన్నారు.

సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- సర్వేజన సుఖీనో భవంతు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సర్వేజన సుఖీనో భవంతు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ హైదరాబాద్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ పురస్కారాలు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మట్టిలో మాణిక్యంలా దాగి ఉన్న సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, వృద్ధులు, మానసిక దివ్యాంగుల కరోన సేవకులు, యోగ, మెడిటేషన్, సంగీతం, నృత్య గురువులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికులు, కర్షకుల సేవలను గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. దీనికి దరఖాస్తు చేసుకునేవారు వారి ప్రతిభను గుర్తించిన ధ్రువపత్రాలు, పేపరు క్లిప్పింగ్‌లు, 4 ఫొటోలతో జిరాక్సులు దరఖాస్తుకు జతచేసి వచ్చేనెల 5వ తేదీలోగా పోస్టు చేయాలన్నారు. సర్వేజన సుఖినోభవంతు కార్యాలయం డోర్ నెం 1-20-164 గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి సికింద్రాబాద్ -15 అడ్రాస్‌కు పోస్టు చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 96523 47207 ను సంప్రదించాలని కోరారు.

అదృశ్యం కేసులపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన పిల్లల కేసులు తదితర అంశాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అక్రమ రవాణాకు ముఖ్యకారాణాలు వివరించారు. కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపకపోవడం, అదే సమయంలో వివిధ సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో స్నేహల వల్ల అక్రమ రవాణాకు గురౌతున్నారని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని అలా తప్పిపోయిన పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందని గుర్తుచేశారు. తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, అక్రమ రవాణా గురవుతున్న బాధితలను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవలసిన చర్యలు, అటువంటి బాధితులకు అందుబాటులో ఉన్న న్యాయసేవలపై వివరించారు. నల్సా వారి అక్రమ రవాణా బాధితులు వాణిజ్యపరమైన లైంగిక దోపిడి బాధితుల పథకం-2025 ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలకు సంబంధించిన కేసుల్లో ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఎస్ఐ ఎల్.కనకరాజు, మహిళా పీఎస్ ఎస్ఐ పి.నాగరత్నం, పోలీస్ అధికారులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కొవ్వూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బాలికపై లైగింక వేధింపులకు పాల్పడిన యువకుడిపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కడియం మండలానికి చెందిన జి.వీర్రాజు భార్య, పిల్లలతో సంక్రాంతికి అమ్మగారింటికి కొవ్వూరు మండలం వచ్చింది. ఈ నెల 23న తిరిగి ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన 14 ఏళ్ల బాలిక తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలికను డి.కిరణ్‌కుమార్ అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి కిడ్నాప్ చేసి ఇంటికి తీసుకువెళ్లాడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం కిరణ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కొత్త వీరంపాలెంలో వ్యక్తిపై కత్తితో దాడి

- మెడ, చేతిపై గాయాలు
- ఆస్తి తగాదాలే కారణం

రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త వీరంపాలెంలో ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి చెయ్యి, మెడపై తీవ్ర గాయాలయ్యాయి, రంగంపేట ఎస్ఐ తోట కృష్ణసాయి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స సతీష్‌కు, మత్స శ్రీనివాస్‌కు ఆస్తి తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సతీష్ తన ఇంటి వద్ద భార్యతో ఉండగా శ్రీనివాస్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. సతీష్ చెయ్యి అడ్డుపెట్టడంతో బొటనవేలు, మెడపై గాయాలయ్యాయి. దీంతో సతీష్‌ను అనపర్తి గంగిరెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సతీష్ భార్య ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, అతడి తండ్రి సుబ్బన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై అడవి పంది దాడి

తీవ్ర గాయాలు


దాడిలో అడవి పంది చేసిన గాయం

గోకవరం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): అడవిపంది దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గంగవరం మండలం దోనేపల్లికి చెందిన బి.విష్ణుదొర మంగళవారం పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న అడివి పంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాధితుడు గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం గోకవరంలోని ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే

కఠిన చర్యలు తప్పవు



రంగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసులు ఏ విధంగా నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ సుధ, ఎస్ఐ దుర్గాప్రసాద్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డా..పార్కింగా?

- ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దుకాణాలు
- అక్కడే కొనుగోలుదారులు వాహనాల పార్కింగ్
- రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని పోలీసులు
- ఆక్రమణలపై కన్నెత్తి చూడని పురపాలక సంఘ అధికారులు


నిడదవోలు ఓవర్ బ్రిడ్జి వద్ద చిరు వ్యాపారాల కారణంగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

నిడదవోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ(రుడా) నిధులతో పురపాలక సంఘం ఆధునీకీకరణ పనులు నిర్వహించింది. పట్టణ పరిధిలో ఆక్రమణలు తొలగించి లక్షలాది రూపాయలను వెచ్చించి అందంగా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అయితే మున్సిపల్ అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారాలకు అడ్డాగా మార్చేసారు. సాయంత్రం వేళల్లో బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్, మిరపకాయ బజ్జీల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వ్యాపారం జోరందుకోవడంతో ఫుట్‌పాత్‌ల వద్ద కొనుగోలుదారుల వాహనాలు పార్క్ చేయడంతో రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానిక ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్లపై వాహనాల అనధికార పార్కింగ్ కారణంగా రాజమహేంద్రవరం, నర్సాపురం నుంచి వచ్చే వాహనదారులు పట్టణంలో ప్రవేశించాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇలా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌లు అక్రమణలకు గురైనా పురపాలక సంఘ అధికారులు పట్టించుకోవడం లేదని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నా పోలీసులు పట్టించుకోని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పశుపోషణకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లులో లేగదూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన


లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు జనవరి 28, (ఆంధ్రజ్యోతి): పశుపోషణ లాభదాయకంగా ఉండేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులు ఆధునిక పద్ధతులు పాటించి పాల దిగుబడి పెంచుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మండలానికి 50 గోకులం షెడ్డులు మంజూరు చేశామని, నియోజకవర్గం స్థాయిలో 200 మంజూరుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. పశువుల ఆసుపత్రి అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జిల్లా పశు వైద్య అధికారి టి.శ్రీనివాసరావు, మాట్లాడుతూ రైతులు సంఘంగా ఏర్పడి పాలకేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటే దళారులు లేకుండా మంచి ధర పొందవచ్చునన్నారు. లేగదూడల ప్రదర్శనలో ఉత్తమ దూడలకు టీడీపీ మండలాధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్ బహుమతులు అందజేశారు. కాగా ప్రదర్శనలో 35కు పైగా లేగదూడలు పాల్గొనగా, కార్యక్రమంలో పాల్గొన్న 52 మంది రైతులకు పాలు క్యాన్‌లు పంపిణీ చేశారు. పశువులకు అవసరమైన కాల్షియం టిన్నులు, మినరల్ మిక్చర్ అందజేశారు. పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు సత్యనారాయణ, సహాయ సంచాలకుడు వెంకటరెడ్డి, పశువైద్యాధికారులు ఎంఎం రాజేష్, యు ముఖర్జీ, నాయకులు దొంగ రామకృష్ణ, తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు, ఉప్పులూరి చిరంజీవి, మిరియాల సతీష్, తాళ్ళూరి వరప్రసాద్, మద్దిపాటి సురేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు ఖర్చు ఆదా

- జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు
- పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన


ధర్మవరంలో పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న మాధవరావు

కొవ్వూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు ఖర్చు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. దొమ్మేరులోని నీరుకొండ సత్యనారాయణ పొలంలో చెరకు, బొప్పాయి, అరటి, నీరుకొండ శేషారావు పొలంలో డ్రాగన్ ఫ్రూట్, పంగిడిలో పాకా వెంకటేశ్వరరావు పొలంలో డ్రోన్ ద్వారా దశపర్ని కషాయం, అగ్నాస్త్రం, మీనామృతం స్ప్రే చేయించారు. కాపవరంలో రైతు రామకృష్ణ ఏటీఎం మోడల్, పంగిడిలో పోషణవాటిక, ధర్మవరంలో బయోకల్చర్ కషాయాలు, పలు రకాల పండ్ల మొక్కలను పరిశీలించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించి, ఖర్చు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీసీ ఐపీవో టీవీ సూర్యప్రకాష్, ఏపీసీఎన్ఎఫ్ అదనపు డీపీఎం మహబూబ్ వలీ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కాపవరంలో డ్రోన్‌తో వేప కషాయం పిచికారీ చేస్తున్న దృశ్యం

డ్రోన్‌తో పిచికారీతో అధిక ఫలితాలు

పెరవలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వరి పంటపై పురుగులు, తెగుళ్ల నియంత్రణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వేప గింజల ఇంగువ కషాయాలను, చేప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించడం వల్ల ఎక్కువ ఫలితాలు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శాఖా రామకృష్ణ పేర్కొన్నారు. కాపవరం, పెరవలి ఉసులుమర్రు గ్రామాల్లో సుమారు 106 ఎకరాల వరి పంటపై డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించారు. డివిజన్ మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వరి పంటపై కాండం తొలిచే పురుగు నివారించడానికి ఈ కషాయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రైతులకు అవగాహన కోసం సుమారు 650 ఎకరాల్లో డ్రోన్‌త పిచికారీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సూర్యనారాయణ, భుజంగరావు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు హుస్సేన్


సఫీకాకు నియామకపత్రం అందజేస్తున్న హుస్సేన్

దేవరపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవ హక్కులను కాపాడడానికి కృషి చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళంపల్లి హుస్సేన్ అన్నారు. దేవరపల్లిలో మంగళవారం మానవ హక్కుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ సామాన్య ప్రజ లకు, నిరుపేద కుటుంబాలకు న్యాయం జరగాలంటే భారత రాజ్యాంగాన్ని తూ.చా తప్పకుండా అమలు చేయాలన్నారు. భారత రాజ్యాంగాన్ని గ్రామ స్థాయిలో అందరికీ తెలిసేటట్టుగా ప్రచారం నిర్వహించాలన్నారు. బాలికల అక్రమ రవాణా వ్యక్తిగత దూషణలు తదితర అంశాలపై దృష్టి పెట్టి వాటి పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సమాచార హక్కు చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలని అప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. విద్యాహక్కు చట్టం, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించాలన్నారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. దేవరపల్లికి చెందిన ఎస్కే సఫీకకు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలిగా నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో హ్యూమన్ ప్రొటెక్షన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ, మహిళా మండలి సభ్యులు షేక్ సహన, షేక్ నగీన, షేక్ రోషిని పాల్గొన్నారు.

మహాకుంభమేళా యాత్రకు ఆర్టీసీ బస్సులు

- రాజమహేంద్రవరం డిపో నుంచి ఫిబ్రవరి 4, 14, 18 తేదీల్లో నడిపేందుకు ఏర్పాట్లు
- ఇప్పటికే టిక్కెట్లన్నీ విక్రయం
- మరింత డిమాండ్ ఉన్నా బస్సులు సిద్ధం చేయలేని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇప్పటికే బస్సులను సిద్ధం చేసి టిక్కెట్ల బుక్కింగ్ కూడా దాదాపుగా పూర్తి చేశారు. రాజమహేంద్రవరం డిపో నుంచి ఫిబ్రవరి 4, 14, 18 తేదీల్లో బస్సులు కుంభమేళాకు బయలుదేరి వెళతాయి. 4వ తేదీన మూడు, 14వ తేదీన రెండు, 18వ తేదీన రెండు బస్సుల్లో భక్తులు కుంభమేళాకు వెళ్లనున్నారు. ఏడు రోజులు, పదకొండు రోజులుగా కుంభమేళా యాత్ర పూర్తయ్యేలా రెండు రూట్లలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. సూపర్‌లగ్జరీ బస్సులను ఈ యాత్రకు ఉపయోగిస్తున్నారు. మహాకుంభమేళా యాత్రకు భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ కనిపిస్తోంది. డిమాండ్ చాలా ఉన్నా మరిన్ని బస్సులు నడపాలంటే కష్టమేనని, అందుకు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి కనిపించడంలేదని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

కుంభమేళా యాత్ర ఇలా ...

ఫిబ్రవరి 4వ తేదీన ప్రారంభమయ్యే ఏడురోజుల కుంభమేళా యాత్రలో భువనేశ్వర్, కోణార్క్, ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా), వారణాసి, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీ కూర్మం, త్రివేణి సంగమ స్నానం, విశ్వనాథ దర్శనం, గయ పిండ ప్రదాన క్షేత్రాలు ఉంటాయి. ప్రయాగరాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుంది. ఈ యాత్రకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి ఒక్కరికి రూ.10,000 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. అలాగే, 18వ తేదీన బయలుదేరే 11 రోజుల కుంభమేళా యాత్రలో 13 క్షేత్రాలు దర్శించుకోవచ్చు. భువనేశ్వర్ లింగరాజ స్వామి దేవాలయం, పూరీ జగన్నాథస్వామి దేవాలయం, కోణార్క్ సూర్యనారాయణస్వామి దేవాలయం, బాజ్‌పూర్ గిరిజాదేవి ఆలయం (శక్తిపీఠం), ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా పుష్కరస్నానం, కల్యాణి దేవి, త్రివేణి సంగమం, కాశీలో కాశీ విశ్వేశ్వరస్వామి(జ్యోతిర్లింగం), కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి (శక్తిపీఠం), అయోధ్య బాల రాముడు నూతన మందిర దర్శనం, సీతామడి సీతా సమాహిత్‌స్థల్ (సీతామహర్షి ఆలయం), నైమిశారణ్యం గోమతి నదీ స్నానం, చక్రతీర్థం రుద్రావర్తం, లలితాదేవి (ఉప శక్తిపీఠం), గయ విష్ణుపాద ఆలయం, మంగళ గౌరీ ఆలయం (శక్తిపీఠం), బుద్ధ గయ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన మహాబోధి ఆలయం, అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయం, అన్నవరం రమాసహిత సత్యనారాయణస్వామి దేవాలయం క్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఈ యాత్రకు ఒక్కరికి రూ.12,800 టిక్కెట్ ధరగా నిర్ణయించారు.

టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా విక్రయం..

కుంభమేళా టిక్కెట్లన్నీ ఇప్పటికే హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆర్టీసీ దీనిపై పెద్దగా ప్రచారం చేయకపోయినా టిక్కెట్లు బుక్ కావడంతో ఆర్టీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 4వ తేదీన, 18న కుంభమేళా యాత్రకు వెళ్లే మొత్తం ఐదు బస్సుల టిక్కెట్లు ఇప్పటికే బుక్కింగ్ పూర్తయిందని, 14వ తేదీన బయలుదేరే రెండు బస్సుల్లో ఒక బస్సుకు టిక్కెట్ బుక్కింగ్ క్లోజ్ కాగా రెండో బస్సుకు సైతం డిమాండ్ ఎక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

తిరుపతి పాదయాత్ర

బృందానికి ఘన స్వాగతం

దేవరపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతికి పాదయాత్ర చేస్తున్న బృందానికి దేవరపల్లిలో ఘన స్వాగతం లభించింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో రూ.7 కోట్లతో భద్రాద్రి రామయ్య ఆలయం నిర్మిస్తున్న సందర్భంగా అదే గ్రామానికి చెందిన రెడ్నం రాంబాబు శ్రీవల్లి దంపతులు తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో వారు మంగళవారం దేవరపల్లి చేరుకున్నారు. పాదయాత్ర బృందానికి మానవత సంస్థ సభ్యులు బల్లా సూర్యచక్రం, పోతుల బలరామకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, హిందువులంతా సమైక్యంగా ఉండాలని ఈ పాదయాత్ర ద్వారా తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, ఆచార్యులు కమలాకర్ ఆచార్యులు, సీహెచ్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' ఆర్థిక సాయం

గోపాలపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఎల్లప్పుడు సిద్ధమేనని సంస్థ సభ్యులు తెలిపారు. మండలంలోని దొండపూడికి చెందిన చిందాడ సూర్యారావు కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులున్నాయని గ్రహించి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గ్రామస్థుల నుంచి రూ.10 వేలు సేకరించి మంగళవారం సూర్యారావుకు అందజేశారు. కార్యక్రమంలో నున్నా అనంత మణికుమార్, మారాజు రాజేష్, వెంకటేశ్వరరావు, మల్లిపూడి శ్రీనివాస్, కొమ్మన ప్రసాద్, తెన్నెటి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో 35 మందికి పశువుల షెడ్లు మంజూరు

ఉండ్రాజవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకంలో 35 మందికి పశువుల కొట్టాలు(షెడ్లు) మంజూరైట్టు మండల ఉపాధి హామీ పథకం టీఏ జి.కాంతారావు మంగళవారం తెలిపారు. వీటిలో ఇప్పటికే 20 పూర్తయినట్టు చెప్పారు. సత్యవాడలో 3, పాలంగిలో ఒకటి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇంకా మండలంలో 11 నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందన్నారు. సత్యవాడలో షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంతారావు పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ డేవిడ్‌కు సత్కారం



పెరవలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పెరవలి ట్రాన్స్‌కో ఏఈ డేవిడ్ నిశ్చల్‌ను మంగళవారం ఆశాఖ ఉద్యోగులు సత్కరించారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది ఆయనను అభినందించారు.

విద్యుదాఘాతంతో గేదె, మూడు ఆవులు మృతి




తాళ్లపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపేట గ్రామ శివారులో 11కేవీ కరెంటు వైరు తెగి ఒక గేదె, మూడు ఆవులు మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. సూరయ్యపేటకు చెందిన అడ్డా చినరాములు గేదెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో గేదెలను మేపుతుండగా విద్యుత్ తీగలు తెగి పడడంతో అక్కడికక్కడే నాలుగు జీవాలు మృతి చెందాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని జీవనాధారం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. తాళ్లపూడి ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.